ఎడ్లంక వాసులకు ఎన్నాళ్లీ కష్టాలు

- ఇటీవల వరదకు కొట్టుకుపోయిన కాజ్‌వే
- అప్పటి నుంచి నది దాటేందుకు అవస్థలు
- నది నీటిలో నడిచి స్కూళ్లు, కాలేజీలకు వెళుతున్న విద్యార్థులు
- ఎడ్లబండ్లపై నదిదాటుతున్న మహిళలు, వృద్ధులు



స్కూల్‌కు వెళ్లేందుకు నదిని దాటుతున్న చిన్నారులు



వరదకు కొట్టుకుపోయిన ఎడ్లంక రహదారి

అవనిగడ్డ: ఏ చిన్న పనికి వెళ్లాలన్నా ఆ ఊరి ప్రజలు కృష్ణా నదిని దాటి వెళ్లాలి. గత నెలలో వచ్చిన వరదలకు ఆ గ్రామానికి ఉన్న ఏకైక రహదారి కొట్టుకుపోయింది. అప్పటి నుంచి నదిలో దిగి విద్యార్థులు పాఠశాల, కాలేజీలకు వెళుతున్నారు. వృద్ధులు, మహిళలు అయితే ఇసుక కోసం వచ్చే ఎడ్లబళ్లపై నది దాటుతున్నారు. కృష్ణా జిల్లా అవనిగడ్డ మండల పరిధిలోని ఎడ్లంక గ్రామస్తుల ఇబ్బందులు చెప్పనలవి కావు.

వరద వచ్చిన ప్రతిసారీ..

కృష్ణానది పాయ మధ్య ఉండే ఎడ్లంక గ్రామంలో 824 మంది నివశిస్తున్నారు. నియోజకవర్గ కేంద్రానికి కేవలం మూడు కిలో మీటర్ల దూరంలో ఉన్న ఈ గ్రామానికి వెళ్లాలంటే కృష్ణానదిపై ఉన్న కాజ్‌వే ఏకైకమార్గం. కృష్ణానదికి వరద వచ్చినప్పుడల్లా ఈ రహదారి కొట్టుకుపోతోంది. గత నెల 1వ తేదీన వచ్చిన వరదలకు ఇలాగే రహదారి కోతకు గురై కృష్ణానదిలో కలిసి పోయింది. అప్పటి నుంచి నేటి వరకూ ఈ గ్రామానికి మార్గం లేదు. కొద్దికాలం పడవలను ఆశ్రయించగా, లోతు తగ్గడంతో 40 రోజుల నుంచి పడవ వేయడం లేదు.

విద్యార్థుల అవస్థలు..

ఎడ్లంక గ్రామం నుంచి స్కూళ్లు, కాలేజీలకు అవనిగడ్డ, ఇతర ప్రాంతాలకు వెళ్లి చదువుకునేవారు 45 మంది వరకూ ఉన్నారు. వీరంతా రోజూ నది నీటిలో దిగి నడిచి వెళుతున్నారు. వృద్ధులు, మహిళలు ఎడ్లబండిపై నదిదాటి వెళుతున్నారు. అర్ధరాత్రి ఎవరికైనా ఏదైనా ఆపద వస్తే వైద్యసేవల కోసం బయటకు వెళ్లాలంటే ఎంతో రిస్క్ తీసుకోవాల్సి వస్తోంది.

వంతెన నిర్మిస్తేనే..

గతంలో ఎప్పుడూ ఇన్నిరోజుల పాటు వరద లేదని 50 రోజుల నుంచి తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని స్థానిక ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు. వంతెన నిర్మిస్తేనే తమకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని పాలకులు స్పందించి వంతెన నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

పిల్లలను ఎత్తుకుని నదిని దాటిస్తున్నాం

గత నెలలో వచ్చిన వరదకు రోడ్డు కొట్టుకుపోయింది. అప్పటి నుంచి పోటు పాటుకు నీరు తగ్గడం లేదు. పిల్లలను భుజాలకు ఎత్తుకుని నది దాటించి స్కూలుకు పంపిస్తున్నాం. మళ్లీ వచ్చేవరకు ఎదురు చూసి తీసుకొస్తున్నాం. వంతెన నిర్మించి మా ఊరి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలి.

– దోవా సుభాషిణి, వార్డు మెంబర్, ఎడ్లంక

మందులు తెచ్చుకోలేక పోతున్నా..



నాకు ఆరోగ్యం అంతంత మాత్రంగానే ఉంటుంది. రోజూ మందులు వాడాలి. ఎక్కువ దూరం నడవలేను. ఏదైనా ఆటోలో వెళదామంటే రోడ్డు కొట్టుకు పోయింది. నన్నెవరన్నా ఎత్తుకు వెళ్లాలన్నా కుదరదు. ఏమీ చేయాలో తెలియడం లేదు. ఆసుపత్రికి వెళ్లి చూపించుకుని మందులు తెచ్చుకోవాలన్నా కుదరడం లేదు.

– నలిగిలి వీరయ్య, ఎడ్లంక

నరకయాతన పడుతున్నారు



మా గ్రామానికి వంతెన నిర్మించాలని ఎప్పటి నుంచో కోరుతున్నా పాలకులు పట్టించుకోవడం లేదు. నాయకులు ఇచ్చిన హామీలు కార్యరూపం దాల్చడం లేదు. మహిళలు, వృద్ధులు, విద్యార్థినిలు నదిని దాటాలంటే నరక యాతన పడుతున్నారు. తక్షణమే వంతెన నిర్మించేందుకు చర్యలు తీసుకోవాలి.

– దోవా గోవర్ధన్, మాలమహానాడు జిల్లా అధ్యక్షుడు

క్లుప్తంగా

విద్యార్థుల సాయం అభినందనీయం



మచిలీపట్నంటౌన్: వరద బాధితులకు సాయం చేసేందుకు విద్యార్థులు ముందుకు రావడం అభినందనీయమని రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. స్థానిక మచిలీపట్నంలోని సుకర్లాబాద్ గాంధీ విద్యాలయం విద్యార్థులు సీఎంఆర్ఎఫ్ నిధికి రూ.25 వేల విలువైన చెక్కును మంత్రి రవీంద్రకు సోమవారం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరద బాధితులకు అండగా నిలవడం కోసం చిన్న పిల్లలు కూడా ముందుకు రావడం చాలా సంతోషంగా ఉందన్నారు. ప్రజలకు ఏదైనా చేయాలనే ఆలోచన విద్యార్థి దశ నుంచే మొదలవతుందనడానికి గాంధీ విద్యాలయం విద్యార్థుల చొరవే నిదర్శనం అని మంత్రి రవీంద్ర అన్నారు. ఈ కార్యక్రమంలో విద్యాలయం నిర్వాహకులు పాల్గొన్నారు.

స్టడీ మెటీరియల్ అందజేత



గోగినేనిపాలెం(ఘంటసాల): ప్రభుత్వ జెడ్పీ హైస్కూల్లో చదువుతున్న పదవ తరగతికి విద్యార్థులకు లెక్కలు స్టడీ మెటీరియల్ ఉచితంగా అందించిన డీఎల్‌వీ బిలిజిరాణి ఆదర్శనీయురాలని గోగినేనిపాలెం జెడ్పీ హైస్కూల్ హెచ్ఎం. తమ్మన వేణుగోపాలరావు అన్నారు. సోమవారం మండలంలోని గోగినేనిపాలెం జెడ్పీ హైస్కూల్లో గణిత శాస్త్ర ఉపాధ్యాయురాలిగా పని చేస్తున్న డీఎల్‌వీ బిలిజిరాణి హైస్కూల్లో 26 మంది పదవ తరగతి విద్యార్థులకు ఉచితంగా లెక్కలు స్టడీ మెటీరియల్‌ను హెచ్ఎం చేతుల మీదుగా అందజేశారు. స్టడీ మెటీరియల్ అందించిన బిజిలీరాణిని హెచ్ఎం వేణుగోపాలరావు, సహోపాధ్యాయులు అభినందించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

రూ.పది నాణెం చెల్లుతుంది



కృత్తివెన్ను: పదిరూపాయల నాణెం చెల్లుబాటవుతుందని, దీనిపై ప్రజలకు అపోహలు వద్దని ఆర్బీఐ ప్రారంభించిన ప్రజాఅవగాహన కార్యక్రమంలో భాగంగా సప్తగిరి గ్రామీణ బ్యాంకు కృత్తివెన్ను బ్రాంచి మేనేజరు కె.వరుణ్‌సాగర్ అన్నారు. సోమవారం కృత్తివెన్ను ప్రదాన సెంటర్లలోని పలు షాపుల యజమానులకు, ప్రజలకు పదిరూపాయల నాణెంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ నాణెం చట్టబద్ధమైనదన్నారు. అన్ని రకాల ఆర్థిక లావాదేవీలకు ఉపయోగించుకోవచ్చన్నారు.

డెకరేషన్‌కు టెండర్లు ఖరారు

మోపిదేవి: స్థానిక శ్రీ వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి దేవస్థానంలో నాగుల చవితి, కార్తీకమాసం సందర్భంగా ఏర్పాటు చేసే ఆలయ అలంకరణకు సీల్డ్ టెండర్స్ ద్వారా లైసెన్సు దారులను ఖరారు చేసినట్లు ఆలయ డీసీ శ్రీరామ వరప్రసాదరావు తెలిపారు. ఆలయ ప్రాంగణంలో సోమవారం సీల్డ్ టెండర్స్ ఓపెన్ చేసి లైసెన్సు దారులను ప్రకటించారు. ఈ సందర్భంగా డీసీ మాట్లాడుతూ నాగుల చవితి, కార్తీకమాసం నెల రోజుల పాటు దేవస్థానంలో చాందిని, ఐరన్ వాటర్ ప్రూఫ్ పెండాల్స్, ఐరన్ క్యూలైన్ల ఏర్పాటు చేసేందుకు మచిలీపట్నం వాస్తవ్యులు సీహెచ్ తిరుమలరావు, నాగుల చవితి– సుబ్రహ్మణ్య షష్టి రెండు రోజులపాటు దేవాలయ ప్రాంగణం, స్టేజీ ఈవెంట్స్ డెకరేషన్ కొరకు ఎం. నరేష్‌బాబు, పచ్చిపూల అలంకరణకు చల్లపల్లికి చెందిన అమలేశ్వరావు లైసెన్సు పొందారని వివరించారు. ఆలయ సూపరింటెండెంట్ బొప్పన సత్యనారాయణ, ఆలయ అధికారులు, సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

డ్రెయిన్లలో వ్యర్థాలు వేస్తే చర్యలు



మచిలీపట్నంటౌన్: స్థానిక జిల్లా సర్వజన ఆసుపత్రి ప్రహరీ వెంబడి ఉన్న దుకాణదారులు వ్యర్థాలను డ్రెయిన్‌లో వేసి మురుగునీరు పారకుండా చేస్తే చర్యలు తప్పవని ఆసుపత్రి డెప్యూటీ సూపరింటెండెంట్ జి.భానుమూర్తి హెచ్చరించారు. మంత్రి కొల్లు రవీంద్ర ఆదేశాల మేరకు ఆసుపత్రి ప్రాంతాన్ని పరిశుభ్రంగా ఉంచే కార్యక్రమంలో భాగంగా వైద్యశాల పరిసరాలను పరిశీలించారు. హోటళ్లను నిర్వహిస్తున్న వారు వ్యర్థాలను డ్రెయిన్‌లో వేయటం వల్ల మురుగునీరు పారక ముంపు సమస్య ఏర్పడుతోందన్నారు. ఇకపై దుకాణదారులు వ్యర్థాలు వేస్తే చర్యలు తీసుకుంటామన్నారు. ఆసుపత్రి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. ఆస్పత్రి ప్రధాన ద్వారం వద్ద ఆటో కార్మికులు వారి వాహనాలను క్రమబద్ధంగా నడుపుకోవాలని, ట్రాఫిక్ సమస్యలు సృష్టిస్తే చర్యలు తీసుకుంటామని డాక్టర్ భానుమూర్తి హెచ్చరించారు.

గ్రామ సభ

గూడూరు: రీ సర్వేలో తలెత్తిన సమస్యల పరిష్కారినికి ప్రభుత్వం నిర్వహిస్తున్న గ్రామ సభలను రైతులు సద్వినియోగించుకోవాలని తహసీల్దారు డి.రాజ్యలక్ష్మి కోరారు. ఏపీ రీ సర్వే ప్రాజెక్టులో భాగంగా రీ సర్వేలో వచ్చిన భూ సమస్యల పరిష్కారానికి శనివారం కోకనారాయణపాలెంలో గ్రామ సభ నిర్వహించారు. రైతులు ఇచ్చిన ఫిర్యాదులపై విచారణ చేసి 15 రోజుల్లో పరిష్కారం చేస్తామని వెల్లడించారు. సర్పంచి బండి అంజలి కుమారి అధ్యక్షతన జరిగిన గ్రామసభలో మండల సర్వేయరు కె.మురళీకృష్ణ, వీఆర్వో కాకుశేశ్వరరావు, నాయకులు దాసరి ఉమాసాయిరామ్, చోడగం బిక్షాలరావు, రైతులు పాల్గొన్నారు.

పంచాయతీలను ప్రభుత్వం అవమానిస్తోంది

గ్రామ సర్పంచ్ చింతా శ్రీనివాసరావు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న సర్పంచ్ శ్రీనివాసరావు

ఉత్తరచిరువోలులంక(మోపిదేవి): పంచాయతీ అనుమతి లేకండా అభివృద్ధి ఎలా సాధ్యపడుతుందని ఉత్తరచిరువోలులంక గ్రామ సర్పంచ్ చింతా శ్రీనివాసరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. మండల పరిధిలోని ఉత్తరచిరువోలులంక గ్రామంలో పల్లె పండుగ–పంచాయతీ వారోత్సవాల్లో బాగంగా నాలుగు రోడ్లు రూ.15 లక్షలు ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో సీసీ రోడ్లగా అభివృద్ధి చేసేందుకు సోమవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా అక్కడ ఉన్న గ్రామ సర్పంచ్ రోడ్లు వేయడానికి పంచాయతీ పాలకవర్గం అనుమతి ఉందా అని గ్రామ కార్యదర్శి రామకోటేశ్వరరావును ప్రశ్నించారు. గత ప్రభుత్వంలో ఆ విధానం ఉండేదని, కూటమి ప్రభుత్వంలో ఆ విధానాన్ని రద్దుచేసినట్లు కేవలం ఎమ్మెల్యే అనుమతితో వెండర్స్ పేరు సరిపోతుందన్నారు.అనంతరం విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి పంచాయతీలకు నేరుగా నిధులు ఇస్తూ, గ్రామాల్లో పంచాయతీలను బలోపేతం చేస్తూ సర్పంచ్‌లకు విలువలిస్తామని ప్రకటనలు చేస్తున్నారని, క్షేత్రస్థాయిలో ఆ విధానం ఎక్కడా కనిపించడం లేదని అసంతృప్తి వ్యక్తంచేశారు. గత ప్రభుత్వం ఏమీ అభివృద్ధి చేయలేదని అసత్య ప్రచారాలు చేసి అధికారంలోకి వచ్చిన కూటమి నాయకులు గ్రామంలో జరిగిన అభివృద్ధి చూడాలన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో గుర్రమ్మ తల్లి రోడ్డును రూ.9 లక్షలతో అభివృద్ధి చేశామని చెప్పారు. ఎంపీ నిధులు రూ.7 లక్షలతో రెండు సీసీ రోడ్లు, గడప గడపకు నిధులు రూ.10 లక్షలతో సీసీ రోడ్డు, రెడ్డొతుపాలెంలో రూ.12 లక్షలతో జీఎస్‌పీ రోడ్డు, ఇంటింటా కుళాయి, నాడు– నేడు కింద పాఠశాల అభివృద్ధి, కోసూరువారిపలెం నుంచి వెంకటాపురం పోవు రింగ్‌రోడ్డు అభివృద్ధి, 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.6 లక్షలతో కో ఆపరేటివ్ బ్యాంకు రోడ్లు అభివృద్ధి, సుమారు రూ.22 లక్షలతో పీఏసీఎస్ కార్యాలయం, నాబార్డ్ నిధులతో పబ్లిపర్సప్ గోడౌన్ నిర్మాణాలు పూర్తి చేశామన్నారు. గ్రామ ఉపసర్పంచ్ బొమ్మసాని లక్ష్మణరావు, పీఏసీఎస్ మాజీ చైర్‌పర్సన్ రెడ్డొతు వెంకట రమణ పాల్గొన్నారు.

రోడ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన

కోసూరువారిపాలెం(మోపిదేవి): మండలంలోని కోసూరువారిపాలెం, నాగాయితిప్ప, మేళ్లమర్తిలంక, ఉత్తరచిరువోలులంక గ్రామాల్లో పల్లె పండుగ–పంచాయతీ వారోత్సవాలలో భాగంగా నూతనంగా మంజూరైన సీసీ రోడ్లకు సోమవారం శంకుస్థాపన పనులను జెడ్పీటీసీ సభ్యులు మెడబలిమి మల్లిఖార్జునరావు ప్రారంభించారు. ఎంపీడీవో స్వర్ణభారతి మాట్లాడుతూ కోసూరువారిపాలెంలో 2 సీసీ రోడ్లుకు రూ.30 లక్షలు, నాగాయితిప్పలో 2 రోడ్లకు రూ.13.50 లక్షలు, మేళ్లమర్తిలంకలో ఒక రోడ్డుకు రూ.4.60 లక్షలు, ఉత్తరచిరువోలులంకలో 4 సీసీ రోడ్లకు రూ.15 లక్షలు ఉపాధి నిధులు మంజూరైనట్లు వివరించారు. సర్పంచ్‌లు కోసూరు అనూష, గరికిపాటి వెంకటేశ్వరావు, చింతా శ్రీనివాసరావు, ఎంపీపీ రావి దుర్గావాణి, మండల వైస్ ఎంపీపీ నడకుదుటి జనసీకుమారి, ఎంపీటీసీ సనకా వెంకట రాజేష్‌బాబు పాల్గొన్నారు. కోసూరువారిపాలెం జనసేన నాయకులు, మాజీ ఉప సర్పంచ్ కోసూరు రామాంజనేయులు మాట్లాడుతూ సీఎం చంద్రబాబునాయుడు, ఉప ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ గ్రామాల్లో అన్ని రోడ్లు అభివృద్ధి చేయాలని చెబుతుండగా కోసూరువారిపాలెంకు మంజూరైన రూ.30 లక్షల్లో బీసీ, ఎస్సీ, ఎస్టీ కాలనీల్లో ఒక్క రోడ్డు కూడా వేయకపోవడంపై చర్యలు తీసుకోవాలని ఎంపీడీవోకు వినతిపత్రం అందజేశారు.

పట్టభద్రులూ.. ఓటు నమోదు చేసుకోండి



సదస్సులో మాట్లాడుతున్న ఇన్‌చార్జి తహసీల్దారు అనిల్‌కుమార్

పెడన: డిగ్రీ పూర్తి చేసిన ఉద్యోగులు అందరూ పట్టభద్రుల ఓటరుగా నమోదు చేసుకోవాలని పెడన ఇన్‌చార్జి తహసీల్దారు కె.అనిల్‌కుమార్ అన్నారు. సోమవారం సాయంత్రం ఆయన వేర్వేరుగా ఎంపీడీవో, మున్సిపల్ కార్యాలయాల్లో సచివాలయ ఉద్యోగులు, ఆయా కార్యాలయ సిబ్బందికి పట్టభద్రుల ఓటరుగా చేర్పులపై అవగాహన సదస్సు నిర్వహించారు. 2021 నాటికి డిగ్రీ, తత్సమానమైన అర్హతలున్న వారు కూడా పట్టభద్రుల ఓటరుగా నమోదు చేసుకోవచ్చన్నారు. ఓటు నమోదుకు దరఖాస్తులు అందుబాటులో ఉన్నాయని, వాటిని పూర్తి చేసి ధ్రువీకరణ ప్రొవిజన్ జిరాక్స్ కాపీలపై గజిటెడ్ అధికారితో సంతకం చేయించిన, ఆధార్ జిరాక్స్, అసెంబ్లీ నియోజకవర్గంలో ఓటరు గుర్తింపు కార్డు జిరాక్స్ లేదా ఎపిక్ నంబరు, దరఖాస్తుకు జత చేసి తహసీల్దారు కార్యాలయంలో అందజేయాల్సిందిగా సూచించారు. ఆయా కార్యక్రమాలలో ఇన్‌చార్జి ఎంపీడీవో ఎం.జయరాం, మున్సిపల్ కమిషనర్ ఎం.గోపాలరావు, ఎన్నికల విభాగం డెప్యూటీ తహసీల్దారు నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

మోపిదేవి: పట్ట భద్రుల ఎమ్మెల్సీ ఓటు నమోదు వచ్చేనెల 6వ తేదీ వరకు ఉంటుందని తహసీల్దారు శ్రీ విద్య తెలిపారు. కృష్ణా, గుంటూరు జిల్లాల ఎమ్మెల్సీ ఓటు నమోదు కొరకు తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం ప్రత్యేక కౌంటర్ ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ అర్హత కలిగిన పట్టభద్రులు త్వరగా నమోదు చేయించుకోవాలని నవంబర్ 1, 2024 చివరి మూడు సంవత్సరాల్లో డిగ్రీ పూర్తయిన అభ్యర్థులు ఈ ఓటుకు అర్హులని వివరించారు. 13 మంది అభ్యర్థులు దరఖాస్తులు చేసుకున్నట్లు వివరించారు.

నేటి నుంచి రెవెన్యూ గ్రామ సభలు..

ఈనెల 22వ తేదీ నుంచి రెవెన్యూ గ్రామ సభలు నిర్వహించనున్నట్లు తహసీల్దార్ తెలిపారు. మండలంలో రీ సర్వే చేసిన భూములకు విస్తీర్ణం, భూమి క్లాసిఫికేషన్, తప్పు, సవరణ వంటివి చేసేందుకు ఈ గ్రామ సభలు నిర్వహిస్తున్నట్లు షెడ్యూల్స్‌ను వివరించారు.

ముంపులో వరిపొలాలు..

ఆందోళనలో అన్నదాతలు

చింతకోళ్లలో 300 ఎకరాల్లో వరి పంటకు నష్టం



కుళ్లిపోయిన వరి దుబ్బులను చూపుతున్న రైతులు

కోడూరు: సముద్రం ఉప్పునీటి కారణంగా వరిపొలాలు ముంపుబారిన పడడంతో అన్నదాతలు లబోదిబోమంటున్నారు. మండలంలోని తీరప్రాంత గ్రామమైన చింతకోళ్ల సమీపంలో రైతులు వరిసాగు చేసేందుకు అష్టకష్టాలు పడుతున్నారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు చింతకోళ్ల– మందపాకల గ్రామాల మధ్య సుమారు 300 ఎకరాల్లో వరిపంట ముంపుబారిన పడింది. అయితే వర్షాలు తొలగిన తరువాత కూడా పొలాల్లో నీరు బయటకు వెళ్లే మార్గం లేకపోవడంతో వరినారుమళ్లు, వరినాట్లు పూర్తిగా దెబ్బతిన్నాయి. పొలాల్లో నీరు రత్నకోడు డ్రెయిన్ ద్వారా సంగమేశ్వరం అవుట్‌ఫాల్ స్లూయిజ్ ద్వారా సముద్రంలోకి వెళ్లాల్సి ఉంది. అయితే ఇక్కడ పరిస్థితి పూర్తిగా భిన్నంగా మారింది. సంగమేశ్వరం అవుట్‌ఫాల్ స్లూయిజ్‌కు గేట్లు లేకపోవడంతో సముద్రం ఉప్పునీరు రత్నకోడు డ్రెయిన్‌లోకి చొచ్చువస్తున్నాయి. ఈ నీరు పంట పొలాల్లోకి చేరడంతో పొలాల్లో ముంపు సమస్య మరింత ఎక్కువైయింది. ఉప్పునీరు పొలాల్లోకి రావడంతో వరినారుమళ్లు, నాట్లు కుళ్లిపోతున్నాయని రైతులు వాపోతున్నారు.


రెండుసార్లు నారుమళ్లు వేసినా..

వరద సమయంలో కూడా సముద్ర ఉప్పునీరు చొచ్చుకురావడంతో పొలాల్లో ముంపుబారిన పడ్డాయి. ఆ సమయంలో కూడా రైతులు వేసిన వరి నారుమళ్లు పూర్తిగా దెబ్బతిన్నాయి. తరువాత రైతులు మళ్లీ రెండోసారి వరినారుమళ్లు పోసుకున్నారు. ప్రస్తుతం ఈ ప్రాంతంలో సుమారు 150 ఎకరాల్లో వరినాట్లు వేశారు. సముద్ర ఉప్పునీరు చొచ్చుకురావడంతో రెండోసారి వేసిన వరినారు మళ్లు, వరినాట్లు పూర్తిగా దెబ్బతిన్నాయని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వరిదుబ్బులు మొత్తం కుళ్లిపోయి పంటకు తీవ్ర నష్టం జరిగిందని వాపోతున్నారు. పొలాల సమస్యను వ్యవసాయ అధికారులకు, ప్రజాప్రతినిధులకు తెలియజేసినా స్పందించలేదని మండిపడుతున్నారు. పొలాలను కనీసం పరిశీలించేందుకు కూడా రాలేదని తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి తమకు న్యాయం చేయాలని రైతులు కోరుతున్నారు.

తృటిలో తప్పిన ప్రమాదం

కోసూరువారిపాలెం(మోపిదేవి): మండలంలో నాగాయితిప్ప నుంచి కోసూరువారిపాలెం జెడ్పీ రోడ్డు పూర్తిగా గుంతలమయం కావడంతో సోమవారం ద్విచక్రవాహనంపై కోసూరువారిపాలెం వెళుతున్న దంపతులు పక్కనే డ్రెయినేజీలోకి దూసుకుపోయారు. వాహనదారులు వెంటనే అప్రమత్తమై వారిని పక్కకు తొలగించి ఆ వాహనానికి తాడులు కట్టి బయటకు లాగారు. కొద్దిపాటి వర్షానికి గుంతల్లో నీరు నిలిచిపోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఈ రోడ్డుకు మరమ్మతులు వెంటనే చేపట్టాలని స్థానికులు అధికారులను కోరుతున్నారు.

కృష్ణానదిలో నీటి మట్టం పరిశీలన



కృష్ణానదిలో నీటి మట్టం తనఖీ చేస్తున్న సీడబ్ల్యూసీ ఏఈఈ ప్రదీప్ కుమార్

శ్రీకాకుళం(ఘంటసాల): కృష్ణానదికి వస్తున్న వరద ఉధృతి నేపథ్యంలో సెంట్రల్ వాటర్ కమిషన్ ఏఈఈ డి.ప్రదీప్ కుమార్ ఆధ్వర్యంలో నీటి మట్టాన్ని సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా శ్రీకాకుళంలోని కృష్ణానది పుష్కర ఘాట్ సమీపంలో ఏర్పాటు చేసిన టెలీమీటర్ సైట్ వద్ద టెలిస్కోప్ సాయంతో నదిలో నీటి మట్టం కొలతలు సేకరించారు. శ్రీకాకుళం నదిలో 5.35 మీటర్ల నీటి మట్టం ఉన్నట్లు ఏఈఈ ప్రదీప్ కుమార్ తెలిపారు. సేకరించిన వివరాలను ఉన్నతాధికారులకు నివేదిక ఇవ్వనున్నట్లు చెప్పారు. కృష్ణానదికి మరింత వరద ఉధృతి పెరిగే అవకాశం ఉందన్నారు. సీడబ్ల్యూసీ జేఈ రామకృష్ణారెడ్డి, ప్రతినిధి మాదాసు వినయ్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి



బంటుమిల్లి: మండల పరిధిలోని నాగన్నచెరువు గ్రామానికి చెందిన జగతాడి గంగాజలం (36) బందరు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం అర్ధరాత్రి మృతిచెందాడు. పోలీసుల సమాచారం మేరకు.. గంగాజలం ఈ నెల 19వ తేదీ తెల్లవారుజామున ఇంటి బయట పాముకాటుకు గురయ్యాడు. కుటుంబ సభ్యులు చికిత్స కోసం బందరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గంగాజలం మృతి చెందాడు. మృతుడికి భార్యా, ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారు. భార్య వెంకటనర్సమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రెగ్యులర్ పశువైద్యుడిని నియమించాలి

ఘంటసాల: స్థానిక పశు వైద్యశాలకు రెగ్యులర్ డాక్టర్‌ను నియమించాలని కోరుతూ మిల్క్‌సొసైటీ ప్రెసిడెంట్ గొర్రెపాటి సురేష్ బాబు ఆధ్వర్యంలో రైతులు ఎంపీడీవో డి.సుబ్బారావుకు సోమవారం అర్జీ సమర్పించారు. ఈ సందర్భంగా సురేష్ మాట్లాడుతూ ఘంటసాల గ్రామంలో రైతులు వ్యవసాయ అనుబంధంగా పాడి పరిశ్రమను నిర్వహిస్తున్నారని చెప్పారు. జిల్లాలోనే అత్యధికంగా పాలు ఉత్పత్తి చేస్తున్న ఘంటసాల పాల ఉత్పత్తిదారుల పరస్పర సహాయక సహకార సంఘం ఉందన్నారు. గ్రామంలో పాల ఉత్పత్తిదారులు పశువైద్యశాలలో వైద్యులు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు చెప్పారు. ప్రస్తుతం డెప్యుటేషన్ మీద పని చేస్తున్న డాక్టర్ కాకుండా రెగ్యులర్ డాక్టర్‌ను నియమించాలని కోరారు. రెగ్యులర్ డాక్టర్‌ను నియమించడం వల్ల పశువుల రైతులకు సకాలంలో వైద్యసేవలు అందుతాయని చెప్పారు.

ఉపాధ్యాయుల వ్యాపారాలపై విచారణ

ఘంటసాల: మండలంలో కొందరు ఉపాధ్యాయులు చిట్టీలు, రియల్ ఎస్టేట్ వ్యాపారాలు చేస్తున్నారనే ఆరోపణలపై మచిలీపట్నం ఉప విద్యాశాఖాధికారి బి.శేఖర్‌సింగ్ సోమవారం ఆయా పాఠశాలల్లో విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా డీవైఈఓ మాట్లాడుతూ ఘంటసాల మండలంలోని తాడేపల్లి గ్రామంలో ప్రభుత్వ పాఠశాలల్లో పని చేస్తున్న ఉపాధ్యాయులు చిట్టీలు, రియల్ ఎస్టేట్ వ్యాపారాలు చేస్తున్నట్లు గుర్తు తెలియని వ్యక్తులు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. ఈ ఫిర్యాదు మేరకు కృష్ణా జిల్లా విద్యాశాఖాధికారి తాహెరా సుల్తానా ఆదేశాల మేరకు తనతోపాటు పామర్రు మండల విద్యాశాఖాధికారి– 2 పద్మవాణి ఆయా పాఠశాలల్లో ఉపాధ్యాయులను విచారించామని తెలిపారు. తాము సేకరించిన వివరాలతో కూడిన నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తామని డీవైఈఓ శేఖర్ సింగ్ ఈ సందర్భంగా తెలియజేశారు.

సమస్యలు పరిష్కరించకపోతే పోరాటాలే శరణ్యం

సీపీఎం కృష్ణాజిల్లా కార్యదర్శి నరసింహారావు



ఘంటసాల: ప్రజా సమస్యలు పరిష్కరించని ప్రభుత్వాలపై పోరాటాలే శరణ్యమని సీపీఎం కృష్ణా జిల్లా కార్యదర్శి వై.నరసింహారావు అన్నారు. ఘంటసాల గోటకంలోని కమ్యూనిటీ హాలు ప్రాంగణంలో మండల సీపీఎం 8వ మహాసభలు బలే రమేష్ అధ్యక్షతన సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా కార్యదర్శి నరసింహారావు మాట్లాడుతూ రైతులు, కార్మికుల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం పరిష్కరించాలని, వారి జీవనభృతిని పెంచాలని ప్రభుత్వాలను కోరుతున్నామన్నారు. ముందుగా మండల సీనియర్ నేత కామ్రేడ్ కంచర్ల నాగరాజు పార్టీ జెండా ఎగుర వేయగా సీపీఎం మండల నూతన కమిటీ కార్యదర్శిగా మేడంకి వెంకటేశ్వరరావు, సభ్యులుగా బలే రమేష్, కంచర్ల నాగరాజు, వెనిగళ్ల నాగమణిని సమావేశంలో ఏగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా కార్యవర్గ సభ్యులు జిల్లా కార్యవర్గ సభ్యులు మాదాల వెంకటేశ్వరరావు, వాకా రామచంద్రరావు, కార్యకర్తలు పాల్గొన్నారు.